పీఏసీఎస్‌లలో డిజిటల్ సేవలు

గ్రామాల్లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్‌లు) రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాయి. ఇందులో చిన్న, సన్నకారు రైతులకు పంట రుణాలతో పాటు సబ్సిడీ కింద ఎరువులు అందజేస్తున్నారు. కొన్ని పీఏసీఎస్‌లలో అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో వాటిని ప్రక్షాళన చేయాలని కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కంప్యూటరీకరణ చేసి లావాదేవీలను ఆన్‌లైన్ చేయాలని నిర్ణయించింది. గూడూరు, శ్రీకాళహస్తి డివిజన్లలో రెండు పీఏసీఎస్‌లను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇక్కడ సత్ఫలితాలు రావడంతో జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పనులు వేగవంతం చేస్తున్నారు.

- రైతులకు నాణ్యమైన, పారదర్శక సేవలే లక్ష్యం......
- జిల్లాలో రెండు పీఏసీఎస్‌లు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక......




చిల్లకూరు పీఏసీఎస్‌లో కంప్యూటరీకరణ పనులు చేస్తున్న అధికారులు, తిప్పగుంటపాళెం పీఏసీఎస్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్‌వో (ఫైల్)

చిల్లకూరు : పీఏసీఎస్‌లలో గతంలో లావాదేవీలు పూర్తిగా కాగితాల రికార్డులు ఉండేవి. దీంతో అవకతవకలు జరుగుతున్నాయి. కొంతమంది రైతుల పేరుతో రుణాలు తీసుకుని స్వాహా చేస్తున్నారు. అలాగే రైతులకు రాయితీతో ఇచ్చే ఎరువులు కూడా సక్రమంగా అందడం లేదు. ఈ క్రమంలో రికార్డుల తోపాటు సేవల వివరాలను ఆన్‌లైన్ చేయడం ద్వారా అవకతవకలకు అవకాశం ఉండదు. పైగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా ఉంటుంది. ప్రతి సభ్యుడి వివరాలు డిజిటలేజేషన్ కావడంతో ఎప్పటికీ చెరిగిపోయే అవకాశం ఉండదు. భవిష్యత్తులో పీఏసీఎస్, డీసీసీబీ, ఇతర బ్యాంకులతో కోర్ బ్యాంకింగ్ కార్యక్రమాలు చేపట్టే వీలు ఉంటుంది. ఆ సమయంలో సభ్యులుగా ఉన్న రైతులకు ఇతర బ్యాంకుల సేవలు కూడా అందుబాటులోకి వస్తాయి. దీనిపై రైతులకు అవగాహన కల్పించేందుకు పీఏసీఎస్‌లలో పనిచేస్తున్న సీఈవోలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. గత నెలలో రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్, జేసీ, డీసీవోలతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు సూచనలు, సలహాలు అందించారు. దీంతో జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పనులు వేగవంతమయ్యాయి.

నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట

జిల్లాలో 60 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వాటిలో సుమారు 1.20 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. కంప్యూటరీకరణ చేయడం ద్వారా ప్రతి సభ్యుడి ఆధార్ కార్డు, భూమి వివరాలు పూర్తిగా నమోదు చేస్తారు. దీంతో పారదర్శకత ఏర్పడుతుంది. ఏ రైతుకు ఎంత రుణం ఇచ్చారనే వివరాలు పూర్తిగా కంప్యూటర్‌లో నిక్షిప్తం అవుతాయి. అధికారులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిధుల దుర్వినియోగం కాకుండా చర్యలు చేపట్టవచ్చు. సహకార చట్టాన్ని అనుసరించి కౌలు భూమిని సాగు చేస్తున్న రైతులు, సొంతభూమి ఉన్న రైతులు సభ్యులుగా ఉండేందుకు అర్హత ఉంటుంది. అలాగే కోర్ బ్యాంకింగ్‌కు పీఏసీఎస్‌ను అనుసంధానం చేయడం ద్వారా మండల కేంద్రాలలోని పీఏసీఎస్‌లలో బ్యాంకు కార్యకలాపాలను కొనసాగించవచ్చు. అలాగే సభ్యులుగా ఉన్న వారికి అన్ని ఆన్‌లైన్ సేవలు అందుతాయి. ఈ క్రమంలోనే గూడూరు డివిజన్‌లో ఊనుగుంటపాళెం, శ్రీకాళహస్తి డివిజన్‌లోని తంగేళ్లపాళెం పీఏసీఎస్‌లను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఇక్కడ ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

త్వరితగతిన పూర్తి చేస్తాం

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు పీఏసీఎస్‌లలో డిజిటల్ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మొదట రెండు పీఏసీఎస్‌లను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి కంప్యూటరీకరణ పనులు వేగంగా పూర్తి చేశాం. మిగిలిన వాటిలో కూడా ప్రభుత్వం విధించిన గడువులోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. రైతుల పూర్తి వివరాలు రాబట్టడంతో పాటు వారి ఆధార్, భూముల సర్వే నంబర్, భూ విస్తీర్ణం తదితర వివరాలను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తాం.

– లక్ష్మి, డీసీవో, తిరుపతి జిల్లా

క్లుప్తంగా

7న మండల సమావేశం

వెంకటగిరి రూరల్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 7న ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కోటేశ్వరరావు గురువారం తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు విధిగా పాల్గొనాలని కోరారు.

10న ఉచిత కంటి వైద్య శిబిరం

డక్కిలి : మండల కేంద్రమైన డక్కిలి జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 10న చాగణం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. తిరుపతి వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు పరీక్షలు చేసి అద్దాలు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేఎన్‌టీయూఏ సాఫ్ట్ బాల్ జట్టుకు ఎన్‌బీకేఆర్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట : విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ బీటెక్ విద్యార్థులు ఏ.చందు, సీహెచ్ విష్ణువర్ధన్‌బాబు జేఎన్‌టీయూఏ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల పీడీ మల్లికార్జున్‌రెడ్డి గురువారం తెలిపారు. నంద్యాలలోని శాంతిరామ ఫార్మసీ కళాశాలలో అక్టోబర్ 2న జరిగిన జేఎన్‌టీయూఏ ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్ బాల్ సెలక్షన్స్‌లో వారు ప్రతిభ చూపినట్టు తెలిపారు. వారు డిసెంబర్‌లో మధ్యప్రదేశ్‌లోని విక్రమ విశ్వవిద్యాలయంలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు.

7 నుంచి ఆర్టీసీ బస్సు పాసులు

రాపూరు: రాపూరు ఆర్టీసీ డిపోలో 7వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సు పాసులు ఇవ్వనున్నట్టు డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. 5, 6వ తేదీల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయనున్నందున సాఫ్ట్‌వేర్ పనిచేయదని తెలిపారు. ఈ క్రమంలో 7వ తేదీ నుంచి విద్యార్థులతోపాటు ఇతరులకు బస్సు పాసులు ఇస్తామని పేర్కొన్నారు.

జెండా ఉత్సవంలో ముగ్గురికి కత్తి పోట్లు

– పాత కక్షలే కారణమని పోలీసులు భావన




చికిత్స పొందుతున్న యువకులు

చిల్లకూరు: గూడూరు పట్టణంలో నిర్వహించిన జెండా ఉత్సవంలో గురువారం వేకువజామున ఘర్షణలు చోటుచేసుకుని, ముగ్గురు కత్తిపోట్లకు గురయ్యారు. పోలీసుల కథనం మేరకు.. గూడూరులో జరిగిన జెండా ఉత్సవం సందర్భంగా బుధవారం రాత్రి ముందస్తుగా పోలీసులు పలు ప్రాంతాల్లో పికెట్ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ బనిగేసాహెబ్ పేటలో రెండు వర్గాల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా గతంలో ఉన్న పాత కక్షలతో ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. దీంతో ముగ్గురు వ్యక్తులపై మరో వర్గానికి చెందిన వారు కత్తులతో దాడి చేయడంతో యస్వంత్, హరీష్, అబ్దుల్ అనే ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురు అపస్మారక స్థితికి చేరుకోవడంతో వారిని ముందుగా గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని నెల్లూరుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శేఖర్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న కల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా ఆలయం వద్ద అంకురార్పణ పూజలు చేసి అనంతరం ధ్వజారోహణం చేశారు. భక్తులకు కొడి ముద్దలు పంపిణీ చేశారు. రాత్రి స్వామి వారి నగరోత్సవాన్ని వైభవంగా చేపట్టారు.

మోసం కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు

సూళ్లూరుపేట రూరల్/తడ: కంపెనీలో భాగస్వామ్యం ఇస్తామని రూ.25 లక్షలు నగదు తీసుకుని మోసం చేసిన దంపతులకు రెండేళ్లు జైలుశిక్ష, రూ.24 వేల జరిమానా విధిస్తూ సూళ్లూరుపేట అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి ఎస్.అనూష గురువారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసికూటర్ ప్రకృతికుమార్ కథనం మేరకు.. తడ మండలం కట్టువ గ్రామంలో ఉన్న భారత్ సర్క్యూట్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ టి.నాగార్జునరావు, ఆతని భార్య స్వరూప సూళ్లూరుపేట గాండ్లవీధికి చెందిన కల్లెటి సుబ్రమణ్యం అనే వ్యక్తికి తమ కంపెనీలో భాగస్వామ్యం ఇస్తామని చెప్పి, 2009లో రూ.25 లక్షలు తీసుకున్నారు. అతనికి భాగస్వామ్యం ఇవ్వకుండా మోసం చేశారు. బాధితుడు ఈ విషయమై తడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. కోర్టులో కేసు విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో జడ్జి నిందితులకు శిక్ష విధించారు.

బెస్ట్ మోటివేటర్ అవార్డులు ప్రదానం



రెడ్ క్రాస్ ద్వారా అవార్డు అందుకుంటున్న మనోజ్‌కుమార్



ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న పెంచలపుల్లయ్య

గూడూరు రూరల్/కలువాయి : గూడూరుకు చెందిన గిద్దలూరు మనోజ్‌కుమార్, కలువాయికి చెందిన జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జి.పెంచల పుల్లయ్య బెస్ట్ మోటివేటర్ అవార్డులకు ఎంపికయ్యారు. జాతీయ రక్తదాన వారోత్సవాల్లో భాగంగా నెల్లూరు రెడ్‌క్రాస్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా చైర్మన్, తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి వారికి అవార్డులు అందజేశారు. మనోజ్‌కుమార్ రెడ్ క్రాస్ ద్వారా గిద్దలూరు రమణయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయన రక్తం దానం చేశారు. 200 యూనిట్ల రక్త దానం చేయించారు. దీంతో ఆయనకు బెస్ట్ మోటివేటర్ అవార్డు ఇచ్చారు. అలాగే జి.పెంచలపుల్లయ్య ఏడాదికి 350 యూనిట్ల రక్తాన్ని జిల్లా బ్లడ్ బ్యాంకుకు అందజేస్తున్నారు. ఆయన ఇప్పటి వరకు 11 సార్లు అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో చిన్న, ప్రదీప్, నవీన్ పాల్గొన్నారు.

ప్రైవేట్ మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

సూళ్లూరుపేట/గూడూరు రూరల్/ నాయుడుపేట టౌన్ : తిరుపతి జిల్లాలో ప్రైవేటు మద్యం షాపుల టెండర్లకు దరఖాస్తులను ఈనెల 1 నుంచి 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ కే నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 227 షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, 10వ తేదీన వాటిని పరిశీలించి, 11న లాటరీ పద్ధతిలో షాపులు కేటాయిస్తామని తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రైవేట్ మద్యం షాపులను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. సూళ్లూరు పట్టణం, రూరల్ ప్రాంతాల్లో 14, తడలో నాలుగు, దొరవారిసత్రంలో రెండు, నాయుడుపేట మున్సిపాలిటీలో 13, పెళ్లకూరు మండలంలో 2, ఓజిలి మండలంలో 2 మద్యం షాపులకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. గూడూరు ఏఈఎస్ పీఎస్ ఊహశ్రీ, నాయుడుపేట సీఐ ఇండ్ల అరుణకుమారి, గూడూరు స్క్వాడ్ సీఐ ఎం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు ఎంపీడీవో గోపి బాధ్యతల స్వీకరణ

చిల్లకూరు : చిల్లకూరు ఎంపీడీవోగా గోపి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన సంగం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సూర్యసాయిని వాకాడుకు బదిలీ చేయగా ఆయన విజయవాడలోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో జాయిన్ అయ్యారు. గోపి మాట్లాడుతూ తాను గతంలో ఇక్కడ ఉపాధి ఏపీడీగా పని చేశానన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే ఈవోపీఆర్‌డీ మాణిక్యం బదిలీపై వెంకటాచలసత్రం వెళ్లారు.

మేనకూరు రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

నాయుడుపేట టౌన్ : మండలంలోని మేనకూరు సమీపంలోని రోడ్డుపై గురువారం రాత్రి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. గ్యాస్ పైపులైన్ కోసం తిమ్మాజికండ్రిగ నుంచి మేనకూరు వరకు రోడ్డుకు ఇరువైపులా తవ్వకాలు చేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఈ క్రమంలోనే గురువారం రాత్రి గుంతల వద్ద వాహనాలు ఇరుక్కుపోయాయి. గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న సీఐ బాబి తమ సిబ్బందిని అక్కడికి పంపించి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన వాహనాలను పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏఈ అనీల్

ఓజిలి: విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ అనీల్ తెలిపారు. మండలంలోని పెదపరియ గ్రామంలో సర్పంచ్ గోవిందు సుధా ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మోటార్ స్విచ్‌లను తడి చేతులతో ముట్టుకోరాదని తెలిపారు. పొలాల్లో తెగిపడిన వైర్లను తాకరాదని, కంచెలకు విద్యుత్ సరఫరా ఇవ్వకూడదన్నారు. రైతులు పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు ఫ్యూజ్‌లను సొంతంగా వేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొమ్మరాజు వెంకటరమణరాజు, పంచాయతీ కార్యదర్శి పెద్దమస్తానయ్య, నాయకులు కిష్టయ్య, పోలయ్య, సుబ్రమణ్యంరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో బహుళ ప్రయోజనాలు

వాకాడు : విత్తన శుద్ధితో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయ శాఖాధికారిణి దీప తెలిపారు. మండలంలోని యరగాటిపల్లిలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎరువులు, నీటి యాజమాన్యం, కలుపు నివారణ, వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు వివరించారు. పశువైద్యశాల ఏడీ డాక్టర్ రమణయ్య పాడి పశువులకు సోకే వ్యాధులు, వాటి నివారణ గురించి వివరించారు.

తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలి

డక్కిలి: రైతులు భూసార పరీక్షలు చేసుకుని ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చునని వెంకటగిరి ఏడీఏ నాగార్జున సాగర్ తెలిపారు. మండలంలోని తీర్థంపాడు, ఆల్తూరుపాడు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటగిరి ఉద్యాన శాఖ అధికారి ఆనంద్‌రెడ్డి, ఏవో విజయభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులతో అనర్థాలు

రసాయనిక ఎరువులు అధిక మోతాదులో వినియోగిస్తే అనేక అనర్థాలు కలుగుతాయని వ్యసాయశాఖ జిల్లా శిక్షణ సమన్వయకర్త భాస్కరయ్య తెలిపారు. లింగసముద్రం గ్రామ రైతులకు గురువారం శిక్షణ ఇచ్చారు. వరిలో అధికంగా వేసిన యూరియాలో 70 శాతానికి పైగా భూమిలోకి చేరుతుందని, దీంతో భూగర్భ జలాలు కలుషితం అవుతాయన్నారు. చీడపీడల బెడద ఎక్కువవుతుందని వివరించారు. కాంప్లెక్స్ ఎరువులు అధికంగా వేయడం వల్ల భూమిలో భాస్వరం పేరుకుపోతుందన్నారు. ఏవో వేణుగోపాల్ రావు, శ్రీహరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ

నాయుడుపేట టౌన్ : సేంద్రియ ఎరువుల తయారీపై ఏవో గణేష్ రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని కల్లిపేడు, నరసారెడ్డి కండ్రిగ గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులను వివరించారు. వీపీఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

సైదాపురం: రైతులు సేంద్రియ ఎరువులను వాడడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో హైమావతి తెలిపారు. మండలంలోని ఊటుకూరులో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసుకుని ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు డ్రిప్ పరికరాలను రాయితీతో అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ ఎంపీ దుర్గాప్రసాద్ సేవలు చిరస్మరణీయం



నాయుడుపేటలో పేదలకు ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న బల్లి జయప్రసాద్‌రావు



బల్లి దుర్గా ప్రసాద్‌రావు జయంతిని నిర్వహిస్తున్న అభిమానులు

నాయుడుపేట టౌన్/చిల్లకూరు : మాజీ ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ సేవలు చిరస్మరణీయమని బల్లి జయప్రసాద్‌రావు తెలిపారు. బల్లి దుర్గాప్రసాద్ జయంతి సందర్భంగా గురువారం బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి బల్లి ఎంతో కృషి చేసి వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. నాయకులు కేఆర్ దాసరి, కందల లోకనాథం, గుంపర్ల వెంకటరాజు, గుండాల నరసింహ, బందిలి సుబ్రమణ్యం, షేక్ జమాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సర్కిల్‌లో బల్లి దుర్గాప్రసాద్‌రావు అభిమానులు అన్నదానం చేశారు. అంతకుముందు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిల్లకూరు జెడ్పీటీసీ మన్నెం శీనయ్య, డీవీఎంసీ సభ్యుడు వాకాటి ప్రభాకర్, మాజీ అటవీ అధికారి వెంకటేశ్వర్లు, సురేష్, రమేష్, సంజీవనాయుడు, చంద్రనీల్, చిన సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలువాయిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్

కలువాయి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేందర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అదాలత్‌లో గూడూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని గూడూరు, గూడూరు రూరల్, కోట సబ్ డివిజన్లకు సంబంధించిన ప్రత్యేక అదాలత్‌కు చైర్‌పర్సన్ రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు కె.రామ్మోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్.ఎల్.అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు జి.ఈశ్వరమ్మ పాల్గొంటారని తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బాలాయపల్లి విద్యార్థిని



యోక్షిత

బాలాయపల్లి(సైదాపురం) : రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు బాలాయపల్లి మండలం నాయుడుచెరువు కండ్రిగకు చెందిన దొమ్మరాజు యోక్షిత ఎంపికైంది. ఆమె పద్మావతి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ చూపింది. ఈ నెల 20న రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఆమెను పలువురు అభినందించారు.

ఘనంగా దసరా ఉత్సవాలు ప్రారంభం





సైదాపురం : విశేషాలంకరణలో అమ్మవారు, చిట్టమూరు: మల్లాంలో లలితాదేవి అలంకారంలో కామాక్షిదేవి, తడ: అమ్మవారి సారెకు పూజలు చేస్తున్న మహిళలు

సూళ్లూరుపేట/సైదాపురం/చిల్లకూరు/నాయుడుపేట టౌన్/చిట్టమూరు(వాకాడు) : సూళ్లూరుపేట, సైదాపురం, చిల్లకూరు, చిట్టమూరు మండలాల్లోని అమ్మవారి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవార్లు ప్రతిరోజూ ఒక అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

- తడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సూళ్లూరుపేటలో వెలసిన చెంగాళ పరమేశ్వరిదేవి పుట్టినిల్లు అయిన గొల్లలములువు గ్రామస్తులు గురువారం సారె సమర్పించారు. గ్రామంలోని వేనాటి కుమారస్వామిరెడ్డి ఇంటి నుంచి సారెను తీసుకురావడం ఆనవాయితీ. చెంగాళమ్మ ఆలయ అసిస్టెంట్ కమిషనర్ బీ ప్రసన్నలక్ష్మి, ఆలయ అర్చకులు కార్యక్రమానికి హాజరై పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- సైదాపురంలో వెలసిన శ్రీబాలా త్రిపుర సుందరి అమ్మవారు బాలా త్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం శ్రీచక్రానికి పన్నీరుతో అభిషేకం చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు.
- చిల్లకూరు మండలం కలవకొండలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోని ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన బూదూరు నల్లయ్య కుటుంబ సభ్యులు ఆదిలక్ష్మి అమ్మవారికి సారె సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.
- చిట్టమూరు మండలంలోని మల్లాంలో వెలసిన శ్రీ కామాక్షిదేవి అమ్మవారు గురువారం లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడలి సుధీర్‌శర్మ అమ్మవారికి ద్రవ్యాభిషేకం, పుష్పాలంకారం, విశేష పూజలు చేశారు. నాయుడుపేటకు చెందిన సర్వేపల్లి నిరంజన్ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.
- రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మిదేవి అమ్మవారు గురువారం సౌభాగ్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాత్రి ఆదిలక్ష్మి దేవి అమ్మవారి ఉత్సవ మూర్తిని సౌభాగ్యలక్ష్మిగా అలంకరించి శ్రీవారి నందనవనంలో ప్రాకారోత్సవం చేశారు. వేపినాపి సమీపంలో ఉన్న అంకమ్మ ఆలయంలో అమ్మవారు అంకాళమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు. రాపూరులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవిగా అనుగ్రహించారు. అదేవిధంగా రాపూరు గ్రామ దేవత రాపూరమ్మ బాలా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో గురువారం సాయంత్రం అమ్మవారు రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయకర్తలుగా కొమరావారిపాళెం చెందిన సింహాద్రి మనోహర్ కుటుంబ సభ్యులు, ఆచర్ల పార్లపల్లికి చెందిన దత్తిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.
- నాయుడుపేట పట్టణంలోని పోలేరమ్మ ఆలయంలో ఈవో ఎం రవికృష్ణ ఆధ్వర్యంలో స్వర్ణముఖి నది నుంచి నీటిని తీసుకుని కలశాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి అభిషేకాలు చేసి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. రాత్రి పోలేరమ్మ పార్వతీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరి అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా అనుగ్రహించారు.




రాపూరు: సౌభాగ్యలక్ష్మిగా పెంచలకోన ఆదిలక్ష్మి, తడ: ఊరేగింపుగా సారె తీసుకు వెళుతున్న మహిళలు



చిల్లకూరు : రాజరాజేశ్వరిగా ముత్యాలమ్మ

బెదిరింపులపై ఫిర్యాదు

పెళ్లకూరు: దళితులను దుర్భాషలాడి చంపేస్తామంటూ బెదిరించిన ఘటనపై గురువారం చిల్లకూరు సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని పెద్ద చెరువులో చేప పిల్లలు పెంచుకోవడానికి వడ్డిపాళెంకు చెందిన రమణయ్య, గిరి, కార్తీక్ చెరువు తూములకు మెజ్(వల) ఏర్పాటు చేశారు. సర్పంచ్ హరిబాబురెడ్డి పంచాయతీ అనుమతులు లేకుండా చెరువులో చేప పిల్లలు వదలకూడదని చిల్లకూరు, వడ్డిపాళెం గ్రామాల్లో దండోరా వేయించారు. ఆ సమయంలో వడ్డిపాళెంకు చెందిన దయాకర్, రమణయ్య తదితరులు దండోరా వేస్తున్న దళితులను దుర్భాషలాడుతూ టీడీపీ నేతలు విజయసేనారెడ్డి, రాకేష్‌రెడ్డి అనుమతులతోనే చేప పిల్లలు వదులుకుంటున్నట్లు, దీనిపై అడ్డు వచ్చిన వాళ్లని చంపేస్తామంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌కు చేరిన రైతుల నుంచి స్థానిక ఎస్‌ఐ నాగరాజు ఫిర్యాదు స్వీకరించకపోవడంతో 100కి డయల్ చేసి ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్‌ఐ కేసును పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

కండలేరులో 25.098 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 25.098 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 1275, పిన్నేరు కాలువకు 40, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9,650 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు.